క్లుప్తంగా...

భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర



కావడి యాత్రలో కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ

జియాగూడ: శ్రావణమాసంలో ఉత్తరభారతీయులు ఎంతో భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర నిర్వహించి ఆలయాల్లో పూజలు నిర్వహించడం జరుగుతుందని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. సోమవారం పురానాపూల్, కార్వాన్, లంగర్‌హౌస్ మీదుగా కొనసాగిన కావడి యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరభారతీయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు రాజు వస్తాద్, చిరురాజ్, అభిషేక్, టి.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిటీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల జయకేతనం



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్

చార్మినార్: సిటీ కళాశాల విద్యార్థులు ఆరుగురు సీఆర్‌పీఎఫ్ ఆర్మీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్ తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం జూనియర్ అండర్ ఆఫీసర్లుగా, సార్జెంట్లుగా ర్యాంకులు పొందిన ఎస్.మనోజ్ కుమార్, గందారం ప్రవీణ్ కల్యాణ్, కె.సంపత్ కుమార్, సంజనా తివారీ, జి.వంశీ, కుర్రబోయిన తేజసాయి ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు రత్న ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ కెప్టెన్ వరప్రసాద్, గజేంద్ర బాబు, మల్లికార్జున్, రవి కుమార్, ఝున్సీ, జయ కాగడ తదితరులు పాల్గొన్నారు.

సీతా రంజిత్‌రెడ్డికి సత్కారం



సీతా రంజిత్‌రెడ్డిని సత్కరించిన బీఆర్ఎస్ నాయకుడు పురుషోత్తమ్‌రావు

అబిడ్స్: టీటీడీ పాలకమండలి నూతన సభ్యుడిగా నియమితులైన సీతా రంజిత్‌రెడ్డిని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్‌రావు మాట్లాడుతూ.. టీటీడీ నూతన పాలకమండలి ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

రాంరెడ్డికి సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డిని ఉప్పుగూడకు చెందిన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బాల్‌రెడ్డి, గండూర్ రామచంద్రం, వెంకటయ్య, మల్లేష్, హనుమంతరావు, పెద్దయ్య, కృష్ణ, హుస్సేన్, బాబు నాయక్ తదితరులు ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

జోరుగా రాఖీల విక్రయాలు



యాకుత్‌పురా: రక్షాబంధన్ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రాఖీ విక్రయా దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కన్పిస్తున్నాయి. యాకుత్‌పురా బహ్మన్‌వాడి, అలీజాకోట్ల, మొఘల్‌పురా, శాలిబండ, లాల్‌దర్వాజా మోడ్, చందూలాల్ బేలా, సుల్తాన్‌షాహి, బేరూన్ గొలిపురా, లలితాబాగ్ సరస్వతినగర్ తదితర ప్రాంతాల్లో రాఖీ దుకాణాలు ఏర్పాటు చేశారు. వన్‌గ్రామ్ గోల్డ్, ఫ్యాన్సీ, ముత్యాలు, రంగురంగుల రాళ్లతో తయారు చేసిన రాఖీలు విక్రయాలకు ఉంచారు. రూ.5 నుంచి రూ.300 వరకు ధరలలో రాఖీలు అందుబాటులో ఉన్నాయని ఓ విక్రయదారుడు తెలిపారు.

డూప్లికేట్ కీ తో దోచేశారు..

కిరాణాషాప్‌లో రూ.7.5 లక్షల నగదు చోరీ, నిందితుల అరెస్టు

జియాగూడ: డుప్లికేట్ కీతో దుకాణాన్ని తెరిచి సుమారు రూ.7.5 లక్షల నగదు చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు గోషామహల్ డివిజన్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శోభన్‌బాబు తెలిపారు. సోమవారం షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. అఫ్జల్‌గంజ్‌లోని శంకర్ షేర్ హోటల్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన జమ్‌తారామ్ సేన్, గొలిగూడకు చెందిన ఓమారామ్‌తో కలిసి ఈ నెల 24న డూప్లికెట్ కీ సాయంతో సిద్దిఅంబర్‌బజార్‌లోని కిరాణా స్టోర్‌లో చొరబడి షాపులో ఉన్న దాదాపు రూ.7.5 లక్షల నగదు దోచుకెళ్లారు. బాధితుడు వికాష్‌జైన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన షాహినాయత్‌గంజ్ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. సోమవారం ఉస్మాన్‌గంజ్ అశోక్‌బజార్‌లోని బవారరామ్ రాజస్థానీ దాబా వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి తదితరులు

దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు ప్రజాదరణ

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రగతి, అభివృద్ధితో తెలంగాణ తరహాలో బీఆర్ఎస్‌కు దేశ నలుమూలలా ప్రజాదారణ లభిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌ను పలు పార్టీల నాయకులు ఆదరిస్తున్నారన్నారు. మహారాష్ట్ర ఉద్గిర్‌కు చెందిన పలు పార్టీల ప్రజా ప్రతినిధులు గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మంత్రి తలసాని కలిశారు. ఉద్గిర్ ప్రాంతంలో పలు పార్టీలకు చెందిన దాదాపు 3 వేల మంది బీఆర్ఎస్‌లో చేరుతామని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి త్వరలోనే బీఆర్ఎస్‌లో చేరికల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ చేరికల కార్యక్రమాన్ని రూపొందించిన ఆనంద్‌కుమార్ గౌడ్‌ను మంత్రి తలసాని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్గిర్ జిల్లా ప్రజా ప్రతినిధులు హజ్రత్‌షా శైలాని, షేక్ సమీర్, దేవా ఘంటే, ఖాజా షేక్, మహబూబ్ సయ్యద్, రహీంపీరావాలే తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసానిని కలిసిన ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉద్గిర్ నాయకులు

'ట్రామా అండ్ రోడ్ సేఫ్టీ'పై అవగాహన



విజయనగర్‌కాలనీ: యాక్సిడెంట్ అయినప్పుడు అంబులెన్సు కోసం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో ఆ వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడటానికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సీలో ఫెషియల్ సర్జన్స్ అఫ్ ఇండియా (తెలంగాణ స్టేట్ చాప్టర్) ఆధ్వర్యంలో సోమవారం జేఎన్‌ఎఫ్‌ఏ యూనివర్సిటీ వేదికగా 'ట్రామా అండ్ రోడ్ సేఫ్టీ'అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే స్పందిస్తే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని, ఇందులో యువకులది కీలక పాత్ర ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన మొదటి 10 నిమిషాలు అత్యంత విలువైన సమయమని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్. లింబాద్రి పేర్కొన్నారు. స్కోప్ వ్యవస్థాపకుడు డాక్టర్ బి. చంద్రకాంత్ రావు, డాక్టర్ పద్మజా పాల్గొన్నారు.

ఘనంగా టప్పా మైసమ్మ బోనాలు



ఉత్సవాల్లో అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: కార్వాన్‌లోని టప్పా మైసమ్మ ఆలయ బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఇటీవలే జరగడంతో అమ్మవారికి బోనాలు నిర్వహించామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి అమర్‌సింగ్, బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్, టప్పా మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి సచిన్ కామ్లేకర్ పాల్గొన్నారు.

పాత మిలటరీ క్వార్టర్స్ వారికి న్యాయం

గోల్కొండ: గోల్కొండ ఎండీ లైన్స్‌లోని నిజాం కాలం నాటి పాత మిలటరీ క్వార్టర్స్ అసలైన యజమానులకు మజ్లిస్ పార్టీ న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మిలటరీ క్వార్టర్స్‌ను వాటి యజమానులకు కేటాయించాలని జీవో జారీ చేశారు. అయితే తదనంతరం తెలంగాణ ఏర్పాటుతో ఆ జీఓ అమలుకాలేదు. అయితే మజ్లిస్ చొరవతో కొంత కాలంగా ఆ జీఓ అమలుకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంది. ఆర్డీఓ ఆధ్వర్యంలో గోల్కొండ ఎండీ లైన్స్‌లోని పాత మిలటరీ క్వార్టర్స్‌ను రెవెన్యూ వారు సర్వే చేసి రిపోర్టు కూడా సమర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకోని పాత మిలటరీ క్వార్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం సోమవారం ఎమ్మెల్యేను మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిసింది. ఈ సందర్భంగా వారు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ ప్రజల వెన్నంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.



ఎండీలైన్స్, పాత మిలట్రీ క్వార్టర్స్ వారితో ఎమ్మెల్యే కౌసర్

మహిళా అభ్యున్నతితోనే దేశ, రాష్ట్రాల అభివృద్ధి

గన్‌ఫౌండ్రీ: మహిళా అభ్యున్నతితోనే దేశ రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమవుతుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం రవీంద్ర భారతిలో మంజునాథ ఫౌండేషన్ ద్వితియ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్నపలువురికి ప్రతిభా బంగారు నంది అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. మహిళలు గౌరవించబడిన చోట అన్ని రంగాల పురాగతి ఉంటుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరం కృష్ణమోహన్ రావు, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుజ్జకృష్ణకు పురస్కారాన్ని అందజేస్తున్న దత్తాత్రేయ తదితరులు

మహాసభను జయప్రదం చేయాలి

నాంపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం హైదరాబాద్ కేంద్రంగా మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని సోమవారం నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి డివిజన్ హరిజన బస్తీలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు త్వరలో హైదరాబాద్‌లో జరుగబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయడానికి మాదిగ జాతి, ఉపకులాలతో ప్రత్యేక కమిటీలను వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నేతలు కటుకూరి సంజయ్‌కుమార్ మాదిగ, కుమ్మరి సత్యనారాయణ మాదిగ, ఉలకొల్లు రామదాసు మాదిగ, జమ్మికుంట జగదీష్ మాదిగ, పరశురాం మాదిగ, కట్కూరి లీలాధర్ మాదిగ, బస్తీ అధ్యక్షుడు రామ్‌చందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ బీజేపీ టికెట్ ఇవ్వాలి

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ సీనియర్ నాయకుడిగా 20 ఏళ్లుగా సేవలందిస్తున్న తనకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ కేటాయించాలని గోల్కొండ బీజేపీ డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్‌ను కలిసి బయోడేటా పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..జియాగూడ డివిజన్ అధ్యక్షుడిగా, బీజేవైఎం కార్యదర్శిగా, డివిజన్ కార్యదర్శిగా, గోల్కొండ జిల్లా డేయిరి సెల్ కన్వీనర్‌గా సేవలందిస్తున్నానన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజ్‌పోల్, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.



పాండుయాదవ్‌కు బయోడేటా అందజేస్తున్న శివకుమార్ యాదవ్

అభివృద్ధి పనులను పూర్తి చేయండి



సమస్యలను తెలుసుకుంటున్న మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్, కార్పొరేటర్

యాకుత్‌పురా: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, పలు విభాగాల అధికారులతో కలిసి రెయిన్‌బజార్ డివిజన్‌లోని యాకుత్‌పురా, బడాబజార్, ఇమాంబడా, ముర్తుజానగర్, మౌలా కా చిల్లా, ఎస్ఆర్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారాన్నికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ టికెట్ కోసం పోటాపోటీ



కృష్ణ



రఘుపాల్‌రెడ్డి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి కాంగ్రెస్ నాయకులు అప్పుడే పోటాపోటీగా రంగంలోకి దిగుతున్నారు. దేశంలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరగడం, మరోవైపు రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ పవనాలు వీస్తుండడంతో పోటీకి కాంగ్రెస్ నాయకులు సై అంటున్నారు. ఇప్పటికే ఆరుగురు సీనియర్ నాయకులు టికెట్ కోసం పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. మరికొందరు కూడా దరఖాస్తు చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఈసారి బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ప్రకటించింది. కాగా గతంలో పోటీ చేసిన టి.జీవన్ సింగ్‌ను కాకుండా ఈసారి జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణను బీఆర్ఎస్ పోటీకి దింపింది. మరోవైపు మజ్లిస్ పార్టీ చివరి నిమిషం వరకు తమ అభ్యర్థిని ప్రకటించే అవకాశం లేదు. అయినా సరే కాంగ్రెస్ టికెట్ కోసం ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే సీనియర్ నాయకులు పురకుల కృష్ణ, అప్సర్ యూసుఫ్‌జాహి, ఉస్మాన్ హాజీరి, వేణుగౌడ్‌తో పాటు ముంగి రఘుపాల్‌రెడ్డి తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. టికెట్ తమకే వస్తుందని ఉస్మాన్‌హాజీరి, అప్సర్ యూసుఫ్ జాహి గట్టి నమ్మకంతో ఉన్నారు. మరోవైపు దరఖాస్తు చేసుకున్న ఇతరులు సైతం టికెట్ తమకే అంటూ చెప్పుకుంటున్నారు. అప్పుడే కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకులు చాపకిందనీరులా తమతమ ప్రయత్నాలను ముమ్మరంగా చేసుకుంటున్నారు.

శ్యాంరావుకు మదర్ థెరిస్సా స్మారక అవార్డు



చార్మినార్: 20 ఏళ్లుగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ప్రముఖ సంఘ సేవకుడు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పార్టీ ఓబీసీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు కాశమ్మోని శ్యాంరావు ముదిరాజ్‌ను మదర్ థెరిస్సా స్మారక అవార్డు–2023కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. 29న ఉదయం 10 గంటలకు బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మదర్ థెరిస్సా జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్, జస్టిస్ న్యాయమూర్తి బి.చంద్రకుమార్‌తో పాటు తెలంగాణ శాసనమండలి సభ్యులు బుగ్గారపు దయానంద్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

నేడు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

గన్‌ఫౌండ్రీ: ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎల్బీస్టేడియంలో క్రీడా దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, 75 నియోజకవర్గ స్టేడియాలు, 33 జిల్లా కేంద్రాల్లో చలో మైదాన్ పేరిట యువ క్రీడా సమ్మేళనాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా దినోత్సవ వేడుకలకు మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, క్రీడల శాఖ కార్యదర్శి శైలజ రామయ్య, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.



ఎల్బీస్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

కల్యాణం.. కమనీయం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్ హనుమాన్ మందిరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని యజ్ఞాచార్యులు పవన్‌కుమార్ ఆచార్యులు, వేదాంతం రాజనర్సింహచార్యుల పర్యవేక్షణంలో వైభవంగా నిర్వహించారు. శంకర్‌నగర్, మురాద్‌నగర్, జేబాబాగ్, విజయనగర్‌కాలనీ, మాసబ్‌ట్యాంక్, సీతారాంబాగ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి అనంతరం భోజన ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గొరిగే శ్రీనివాస్, ట్రస్టు అధ్యక్షుడు సత్యంచారి, బి.రమేష్‌కుమార్, దాసశ్రీనివాస్, సామల శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు. అంజయ్యయాదవ్, శ్రీనివాస్ మేస్త్రీ, నిర్మల్ సింగ్, గురు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



మంగళ సూత్రాలను చూపిస్తున్న వేద పండితులు

కస్టమర్లే ఏ సంస్థకైనా బలమైన పునాది



వార్షికోత్సవంలో పాల్గొన్న సంస్థ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

అబిడ్స్: కస్టమర్లే ఏ సంస్థకై నా బలమైన పునాదులని ఎలిగెంట్ గ్రూప్ సంస్థ ఎండీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గ్రూప్ వార్షికోత్సవ వేడుకలను కస్టమర్ల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ఖాతాదారులే తమ సంస్థకు దేవుడిలాంటి వారన్నారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు, మార్కెటింగ్ సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

గౌలిపురా: బాలిక అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చార్మినార్ యునానీ ఆస్పత్రి ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈనెల 27న ఉదయం 9 గంటల ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తన కూతురు కనిపించడం లేదని తల్లి సహేరా భాను పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అన్నదానం



సుల్తాన్‌బజార్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో గౌలిగూడ రామమందిర్ వద్ద నిత్య అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో బజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు, రజని, శ్రీనివాస్‌గుప్తా, నందుకుమార్ అగర్వాల్, ఠాకూర్, వికాస్ సింగ్, వినిత్ యాదవ్, ప్రవీణ్‌యాదవ్, ఎస్‌కే.శర్మ పాల్గొన్నారు.

నియామకం



కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను కలిసి బొకే అందజేస్తున్న మహ్మద్ సలీం తదితరులు

చార్మినార్: గ్రేటర్ టీటీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ సలీం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. టీటీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హబీబ్ మహ్మద్ అల్ హైద్రూస్, గ్రేటర్ తెలుగు యువత మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ అన్వర్ హుస్సేన్, దస్తగిరి, సయ్యద్ సాజిద్ పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి విశ్వ సేవామూర్తి మదర్ థెరిస్సా విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, జబర్దస్త్ నటులు చిట్టిబాబు, వినోద్, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎస్.సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలల్లో దోమల మందు పిచికారీ



గోల్కొండ: దోమలు వృద్ధి చెందకుండా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దోమల మందు స్ప్రే చేస్తున్నామని బల్దియా ఎంటమాలజీ ఎస్ఎఫ్ఏ ఫయాజ్ అన్నారు. సోమవారం గోల్కొండ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయన ఆధ్వర్యంలో దోమల మందును స్ప్రే చేశారు. దోమల వల్ల టైఫాయిడ్, మలేరియాతో పాటు డెంగీ వ్యాపిస్తున్నాయని ఆయన అన్నారు.

వేర్వేరు కేసుల్లో 8 మందికి జైలు

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు కేసుల్లో ఎనిమిది మందికి సోమవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాదన్నపేట్ వికాస్ స్కూల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ముస్తాక్ అహ్మద్ (32), పహాడీషరీఫ్‌కు చెందిన షేక్ నదీమ్ (21), కలందర్‌నగర్‌కు చెందిన సయ్యద్ బర్కత్ (25), సయ్యద్ ఫిర్దోస్ (30), షేక్ సాజిద్ (30)లు నిషేధిత పొగాకుతో పాటు అనుమానాస్పదంగా కనిపించారు. అదే విధంగా ఎల్‌బీనగర్‌కు చెందిన కె.సోమయ్య స్థానికంగా ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నాడు. మాదన్నపేట్ రాంచంద్రనగర్‌కు చెందిన షేక్ అంజద్ మోహీద్దీన్ (54), షేక్ అఖిల్ మోహీద్దీన్ (22)లు వారి అపార్ట్‌మెంట్‌లోని మహిళా పని మనిషిపై చేయి చేసుకున్నారు. దీంతో వీరందరిని ఐ.ఎస్.సదన్ పోలీసులు అరెస్ట్ చేసి ఈ–పెట్టీ కేసులు నమోదు చేసి సోమవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు వీరికి 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

'దళితులను కేసీఆర్ మోసం చేశారు'



గౌరీ సతీష్

అబిడ్స్: దళితులను సీఎం కేసీఆర్ అన్నివిధాల మోసం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో దళితులకు ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 2014లో అధికారంలోకి వచ్చేటప్పుడు దళితులను ముఖ్యమంత్రి చేస్తానని బహిరంగ సభలో ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు ఆయననే ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 3 ఎకరాల భూమిని దళిత కుటుంబాలకు ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఆయన ప్రకటనలు ఎక్కడ పోయాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితులకు ఇచ్చిన వాగ్దానాలు అన్ని అమలు చేస్తామన్నారు.

లైక్‌ల కోసం స్నేహితుడిపై దాడి

డబీర్‌పురా: సోషల్ మీడియాలో లైక్‌లు, పాపులారిటీ కోసం స్నేహితుడిపై దాడికి పాల్పడిన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం .. అలిజాకోట్లా జాఫరీ గల్లీ ప్రాంతానికి చెందిన షేక్ మహ్మద్ ఓవైస్ (22), యాకుత్‌పురా మాతాకి కిడికి ప్రాంతానికి చెందిన సయ్యద్ ఉస్మాన్ అలీ (18) మైనర్ బాలుడు, మరొకరు స్నేహితులు. షేక్ మహ్మద్ ఓవైస్‌కు మిగతా ముగ్గురితో ఇటీవల మనస్పర్థలు వచ్చాయి. ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు ఉస్మాన్ అలీ, మైనర్ బాలుడితో పాటు మరో స్నేహితుడు సామాజిక మాధ్యమాల్లో ఫాలోయింగ్, లైక్‌ల కోసం స్నేహితుడైన షేక్ మహ్మద్ ఓవైస్‌పై దాడి చేసి కత్తితో బెదిరించారు. ఈ ఘటనను మొత్తం వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. బాధితుడు ఓవైస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సయ్యద్ ఉస్మాన్ అలీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.